


# కష్టఫలం

మేరెడ్డి యాదగిరిరెడ్డి

రంగారెడ్డి ఆ ప్రాంతంలో బాగా పేరున్న వాడు. నైజాం నవాబ్ కాలంలో దొర గానూ ప్రస్తుతం పంచాయితీ ప్రెసిడెంట్ గానూ ఆ ఊరు అధికారాన్ని చలాయిస్తు న్నాడు. అతడు విగ్రహంతో, తన కున్న ఆస్తిపాస్తులతో రాజా రంగారెడ్డిగా జనంలో చలామణి అవుతున్నాడు. అతడు చిన్న తనం నుండి కూడా అధికారంలో ఉన్న ప్పటి పార్టీ సభ్యుడుగా ఉంటున్నాడు. అతనికో అందమైన తెల్లటి బంగళా ఉంది. అది తాతలకాలం నాటిదే! ఆ యిల్లు ఊరికి కోటలాంటిది. రాజులాంటివాడే రంగారెడ్డి. అతనిది నిండైన విగ్రహం, బుర్రమీసాలు. ఓ పదిలక్షల రూపాయలకు, రెండొందల ఎకరాల భూమికి అధికారి. ఓ రెండు కంపెనీలల్లో వాటాదారు. పెద్ద కొడుకు డాక్టరు. ప్రస్తుతం ఆ ఏరియా రాజకీయాల్లో పేరుమోసిన వ్యక్తి. చిన్నవాడు మాత్రం రాజకీయ పరిశీలకుడుగా అన్ని దేశాలూ తిరుగుతున్నాడు. తిరిగొచ్చాక వ్యాపారం ప్రారంభిద్దామని.

రంగారెడ్డి బంగళా ముందు ఓ వేప చెట్టు. దాని చుట్టూ ఓ సిమెంటు అరుగు ఉంది.దానిమీద రెడ్డిగారు తప్ప ఇంకెవ్వరూ కూర్చునే హక్కూ, అర్హతల్లేవు. ఆ వేళ రెండు గంటలయింది. ఎండ మండి పోతోంది. గాలి వీచడం లేదు. రాజారెడ్డి లాల్చీ విడిచి గాలికోసం బనీనుతో అరుగు మీది కొచ్చాడు. ఊర్లోని రైతులందరికీ బాతఖానికి అది సెంటరు. వచ్చిపోయే అధికార్లు, తెల్లటి మేడ గనుక రంగారెడ్డి ఇంటికే వస్తుంటారు. ఆ బంగళా తలు పులు ఎప్పుడూ మూసే వుంటాయి. ఎవ రన్నా కుర్రకారు తలుపుల సందులోంచి లోపలికి తొంగి చూశారో వాళ్ళవీపు సాపు కావాల్సిందే. రాణిగార్లు - అంటే రెడ్డిగారి భార్య, కూతురు, కోడలు సాయంకాలం బంగళా మీది నుండి వరదబాధితులను అధికారులు హెలికాప్టర్ల నుండి చూసినట్లు, ఆ ఊరి జనాన్ని తిలకించి ఆనందిస్తారు.

మాలమాదిగలంటే రెడ్డిగార్కి ఎనలేని జాలి. ఎప్పుడూ వారి సంక్షేమం గురించి

ఉపన్యాసాలిస్తుంటాడు. ఆ ఊరికి దూరంగా అరమైలు దూరంలో గుడిసెలు వేసుకోండని చెప్పాడు. రెడ్డిగారు కండువా తీసి మోకాళ్ళ చుట్టు కట్టుకొని చెట్టుకు ఆనుకొని కూర్చున్నాడు. చుట్ట వెలిగించాడు. రెడ్డిగారి వందిమాగధులంతా అరుగు చుట్టు చేరారు. రెడ్డిగారు అన్న ప్రతిదానికీ తల ఊపి, నవ్వితే చుట్టలోకి ఇంత పుగాకు దొరుకుతుందని వాళ్ళ ఆశ. వేపచెట్టు మీద కాకులు అరుస్తున్నాయి. ప్రక్క వీధిలో కుక్కలు అరుస్తున్నాయి.

"అమ్మా! ఒక్క ముద్దెయి తల్లీ" కడుపు కాలిపోతుంది. ఒక్క ముద్దెయ్యమ్మా."

"ఏయ్, ఏమిటా అరుపులు? ఇంట్లో వంటిది నిద్రపోతుంది" రెడ్డిగారి ఘర్జనకు వీరయ్య ఉలిక్కి పడ్డాడు. "కడుపు కాలిపోతుంది దొరా! ఒక్క ముద్దేపిచ్చండి దొరా!"

చుట్టపొగ వదిలాడు. "అది సరేగాని నీదేవూరు?"

"మామిడాల దొరా!"

"మీ రెక్కడదిగారు?"

"ఊరవతల గడ్డమీద."

"ఎవరుండమన్నారు?"

"ఎవర్నడగ లేదు, దొరా."

"ఎవర్నడగ లేమా?" గుడ్లురిమాడు. "పోలీసులకిపోర్టిస్తా జాగ్రత్త. మీ కులం?"

"ఎరుకలోల్లమయ్యా"

"ఆఁ! విన్నారయ్యా! మీరంతా! మొన్న పరిటాలలో ఎరుకలోడు ఏం చేశాడో! అర్ధరాత్రి అమ్మాయిని హత్యచేసి నగలు దోచుక పోయాడు. ఈ అడుక్కుతినే ముండాకొడుకుల నమ్మగూడదు" రెడ్డిగారు తన అనుభవాన్ని వివరించాడు. అక్కడున్నవాళ్ళంతా తాళం గొట్టారు. తమ అనుభవాలు ఉన్నవీ లేనివీ కల్పించిచెప్పారు.

వీరయ్యకు కడుపులో ఆకలి వేస్తుంది. తలనొప్పిగా ఉంది. నిన్న తిన్న అన్నము. ఇంతవరకు దొరకలేదు కప్పలన్నా పట్టుకొని అమ్ముకుందామంటే అవీ అయిపోయాయి. ఊళ్ళో తెల్లటి బంగళా చూసి వచ్చాడు.

"దొరా ఏదో మీ దయ .. ఇంత ."


వీరయ్య నసిగాడు.

"నీ పేరేమన్నావు?"

"వీరయ్య, సామి."

"చూడు వీరయ్యా, ఇలా అందరు అడుక్కుతింటే దేశంలో కష్టంచేసేవాడెవడు చెప్పు? ఈ దేశానికి స్వాతంత్ర్యము కోసం మేము ఆ రోజుల్లో గాంధీగారితో కలిసి ఎంత కష్టపడ్డాము అటువంటి దేశం ఈ రోజు అప్పులపాలయిందంటే కారణం ఏమిటి? సోమరితనం. దేశంలో కొన్ని లక్షల మంది నీలాటివాళ్లుండబట్టే తిండి కరువు, బట్ట కరువు, అన్ని కరువులే. ఇతర దేశాల నుండి అప్పులెందుకు తెస్తున్నాము చెప్పు? మనకు భూముల్లేవా! నీరులేదా? ప్రతివాడు కూర్చుని సంపాదించాలంటే ఎలాగయ్యా! ఏదో కష్టంచేస్తే నీవు బాగుపడతావు, దేశానికి






సాయం చేసినవాడివవుతావు" ఉపన్యాసం ముగించాడు రెడ్డి. గాంధి శతజయంతికి మటుకి రెడ్డిగారు ప్రస్తుతము అధ్యక్షుడు. ఆయన ప్రతిమాటల్లో గాంధి పేరు వాడు తాడు ఉన్న టెరికాటన్ బట్టలు తీసేసి ఈ మధ్యనే ఖద్దరు తొడుక్కున్నాడు

రెడ్డి చెప్పిన మాటలు వీరయ్యకు అర్థంగాకున్నా తలూపాడు. రెడ్డి నవ్వాడు అక్కడున్న వాల్లంతా నవ్వారు.

"ఏం చేయాల దొరా?"వీరయ్య కండ్లో నీళ్ళు తిరిగాయి. నోటమాట సరిగా రావడం లేదు.

"ఏం చేయాలా! ఇటుపోతే అడవి. కట్టెలులు కొట్టుక అమ్ముకో. అటుపోతే చెరువు. చేపలు పట్టు. పెట్టుబడిలేని వ్యాపారం "కష్టేఫలిః" అన్నారు పెద్దలు. ఇదిగో వీరయ్యా, ఈ ఊళ్లో ఇంకెవరు నీకు పెట్టరు. జాగ్రత్తగా వెళ్ళి ఏదోపని చేసుకో. లేకుంటే వెళ్ళిపో! ఈ భిక్షాటనంటే నాకు తగని మంట." రెడ్డిగారు ఆవులించాడు. లేచి ఇంట్లోకి వెళ్ళిపోయాడు. అక్కడున్న జనంకూడ పోతున్నారు. వీరయ్య ఆశ, అడి యాసైంది. ఇంత చెప్పినా కనీసం రెండు శేర్ల గింజలన్నా దొరుకుతా యనుకున్నాడు. అదీ లేదు.

వీరయ్య రెడ్డి చెప్పిందాంట్లో కొంత నిజమే ఉందనుకున్నాడు. తన తోటి రంగన్న పట్నంలో కష్టం చేసుకుని ఇల్లు కట్టుకున్నాడు. రెడ్డిగారు చెప్పినట్లు చేస్తే వారికి దయ గలుగవచ్చు. తనకీ వూళ్లో ఓ గుడిసె వేయించవచ్చు. ఇంతపని చూపించవచ్చు. వాగెంట ఉన్న పోరం బోకు ఇప్పించవచ్చు. ఆలోచనలతో వీరయ్య అడవికి బయలుదేరాడు.

*　　　　　*

అదేరోజు సూర్యుడు పశ్చిమాన ఉన్న వేళ. రెడ్డిగారు నిషాతో ఉన్నవేళ. ఊరి జనం కల్లు నిషాలో ఉన్నవేళ మళ్ళీ అరుగు

వద్ద అందరు కూడారు. రెడ్డిగారు జాతీయ, అంతర్జాతీయ విషయాలు చెపుతున్నాడు. రెడ్డిగారు తన తీర్థయాత్రా విశేషాలు చెబుతున్నాడు. "ఒకసారేమయిందంటే నేను కాశీ వెళ్లాను. అక్కడ బెనారస్ సత్రంలో దిగాను. నేనున్న ప్రక్క గదిలో ఆసక్తిదాయకమైన సంభాషణ జరుగుతోంది. ఒకడు అడుగుతున్నాడు. "ఈ రోజెంత సంపాదించావు?" "ఇంకా మొదలు పెట్టలేదు" ఆడకంఠం జవాబు. "ఎన్నాళ్ళు గింజుకుంటావో చూస్తాను." ప్రక్కగదిలో క్రొత్తవాడు దిగాడు! అతని కంఠం కర్కశంగా ఉంది. అతను వెళ్లిపోయాడు. పాపం! ఆ అమ్మాయి జాలి చూపులతో నా వైపు చూసింది. నేను తెచ్చి పెంచుకుందామనుకున్నాను. కాని ఇంట్లో నా పెండ్లాం బయట ఈ సంఘం ఊరకుంటుందా అని .. " రెడ్డిగారు ఇంకా చెబుతున్నాడు అందరు తమ జన్మ తరించినట్లు వింటున్నారు

"దొరా, కట్టెలు!" కట్టెల మోపుతో వీరయ్య వచ్చాడు. అతని చొక్కా అంతా చిరిగిపోయింది. జుట్టు దుమ్ముకొట్టి వుంది. ప్రొద్దుట నుండి అన్నం లేక కండ్లు పీక్కుపోయాయి.

రంగారెడ్డి లేచాడు. కట్టెల మోపు కాలుతో అటూ, ఇటూ దొర్లించాడు. అతని ముఖం ఎర్ర బారింది. నోట్లో చుట్టదీసి దుర్వాసుడు వెంట్రుకలు నేలకు కొట్టినట్లు కొట్టాడు.

ఒరేయి వెంకన్నా! ఎక్కడ చచ్చావ్రా!

వీరయ్య బిక్కమొగం వేసి చూస్తున్నాడు. పరీక్షలో బాగా వ్రాసి పాసవుతాననుకొన్న విద్యార్థికి"మాల్ ప్రాక్టీస్" అని రిమార్కు వచ్చినట్లయింది వీరయ్య పరిస్థితి. "ఇటు రా రా! ఈ కట్టెలు చూడు! ఎక్కడివిరా ఇవి?"

"అయ్యా! దొరా!" జీతగాడు నసుగుతున్నాడు. "ఇవన్నీ మనం నాట్లకోసం కొట్టిన కట్టెలు కావురా?"

"అవు దొరా!"అందరూ తలలూపారు. అందులోనుండి ఓ కట్టె తీశాడు. వీరయ్య జుట్టందుకున్నాడు.

"దొంగలంజకొడకా! కష్టం చేసుకోమంటే నాకే ఎసరు పెడతావురా! ఎన్ని గుండెల్రా నీకు? వీ డెవడనుకున్నావురా రాజా రంగారెడ్డి!" ఒకటి, రెండు........ పది ధనా, ధనా దెబ్బలేస్తున్నాడు.

"నీ కాలుమొక్త దొరా! అడవికిపోయి తెచ్చా దొరా?"

"అదిగో! అదే! నా కట్టెలు నాకు తెలువవట్రా." కట్టె విరిగిపోయింది. రెడ్డిగారు అలసిపోయాడు. నిషా దిగిపోయింది. వీరయ్య వంటి మీద రక్తం మరక లయ్యాయి.

"ఇదిగో, మళ్ళీ ఈ ప్రాంతంలో అడుగు పెడితివి, నీ బొక్కలిరగ్గొడతా!"

వీరయ్య వెళ్ళిపోయాడు.

"వెంకన్నా, ఈ కట్టెలమోపు ఇంట్లో పడేయి. మూడు రోజుల నుండి అమ్మగారు కట్టెలు లేవంటే ఒక్కడన్నా వింటేనా? మీకు జీతాలు దండుగ. తీసుకెళ్ళు."

ఆ రాత్రి రంగారెడ్డి పట్టెమంచం మీద భార్య జడలోని మల్లెల వాసనతో హాయిగా నిద్రపోయాడు.